జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 5-5-2026 శ్రీకాకుళం సంపుటి: 3 సంచిక: 663 పేజీలు: 4 వెల: రూ.7

* చుట్టపు చూపుగా వచ్చి చోరీలు * బంధువుల ఇళ్లకే కన్నం * ఎవరికీ అనుమానం రాకుండా మూడిళ్లలో దొంగతనాలు * 22 తులాల బంగారం, 8 తులాల వెండి ఆభరణాలు అపహరణ * విక్రయానికి వెళుతూ పోలీసులకు పట్టుబడిన మహిళ

# కిలేడి.. లక్ష్మి



**నరసన్నపేట/జలుమూరు, మే 4 (వార్త):** బంధువుల ఇంటికి చుట్టపుచూపుగా వచ్చి ఎవరికీ అనుమానం రాకుండా చోరీలకు పాల్పడుతూ.. చివరికి కటకటాలపాలైంది.. ఓ మహిళ. బంధువుల ఇళ్లకే కన్నం వేసి ఏకంగా 22 తులాల బంగారం, 8 తులాల వెండి ఆభరణాలు అపహరించిన ఘటన సారవకోట మండలంలో చోటుచేసుకుంది. నరసన్నపేట డీఎస్పీ డి.లక్ష్మణరావు సోమవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. సారవకోట మండలంలోని బైదలాపురం గ్రామానికి చెందిన ముద్దాడ లక్ష్మి కుటుంబంతో కలసి విశాఖపట్నంలో నివాసం ఉంటుంది. ఆమె అత్తగారిది సారవకోట మండలంలోని అవలంగి గ్రామం. విశాఖపట్నంలో ఉంటున్న ఆమె పండుగలకి, ఇతర శుభకార్యాలకి అవలంగి వస్తూ వెళ్తుంటుంది. ఈ క్రమంలోనే ఈ ఏడాది మార్చి 21న సొంత పని మీద అవలంగి గ్రామానికి వచ్చిన ఆమె అదే గ్రామంలో నివసిస్తున్న ముద్దాడ గౌరినాయుడు ఇంటిలో ఎవరూ లేని సమయంలో ప్రవేశించి కప్‌బోర్డులో దాచుకున్న 13 తులాల బంగారు ఆభరణాలు, 8 తులాల విలువగల 2 వెండి మొలతాడులను దొంగిలించింది. అలాగే ఏప్రిల్ 20,21 తేదీలలో యాళ్ళ రాము ఇంటి వద్ద వారి కుటుంబ సభ్యులు వరండాలో నిద్రిస్తున్న సమయంలో యాళ్ల పావని మెడలో ఉన్న సుమారు 2 తులాల బంగారు పుస్తెల తాడు, యాళ్ల శకుంతల మెడలో ఉన్న మరో సుమారు 2 తులాల బంగారు పుస్తెల తాడును దొంగిలించింది. అదేవిధంగా ఏప్రిల్ 26న రాత్రి సుమారు 1:30 గంటల సమయంలో అవలంగి గ్రామంలో గుండ బోడేసు ఇంటిలో, అతని భార్య లక్ష్మినారాయణ మెడలో ఉన్న సుమారు 2 తులాల బంగారు పుస్తెల తాడును దొంగిలించింది. దొంగిలించిన బంగారు ఆభరణాలలో కొన్నింటిని అమ్మకానికి తీసుకుని వెళుతుండగా, బుడితి జంక్షన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఆమె తీరు అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో ముద్దాడ లక్ష్మిని పోలీసులు విచారించగా తాను చేసిన చోరీలను అంగీకరించిందని డీఎస్పీ లక్ష్మణరావు తెలిపారు. ఆమెను అరెస్టు చేసి 22 తులాల బంగారం, 8 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ చోరీ కేసులను ఛేదించడంలో ప్రతిభ కనబరచిన నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మరదాన శ్రీనివాసరావు, సారవకోట ఎస్ఐ బి.అనిల్ కుమార్, నరసన్నపేట, జలుమూరు, పోలాకి ఎస్ఐలు, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి అభినందించారు.

## బెట్టింగ్ భూతానికి.. వివాహిత బలి

**శ్రీకాకుళం క్రైం/జి.సిగడాం, మే 4 (వార్త):** క్రికెట్ బెట్టింగ్ భూతం.. ఓ మహిళను బలిగొంది. బెట్టింగ్ ఆడి జీవితాలు నాశనం చేసుకోవద్దని పోలీసులు పదేపదే హెచ్చరికలు చేస్తున్నా కొందరు పట్టించుకోవడం లేదు. క్రికెట్ బెట్టింగ్‌లు ఆడి సర్వం కోల్పోయి కుటుంబాలను రోడ్డుకీడుస్తున్నారు. భర్త బెట్టింగ్‌కు బానిసై ఆస్తులు తాకట్టు పెడుతుండడం, పలుమార్లు హెచ్చరికలు చేసినా పట్టించుకోకపోవడంతో చివరికి మనస్తాపంతో భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన జి.సిగడాం మండలం ఆనందపురం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జి.సిగడాం మండలం ఆనందపురానికి చెందిన కిమిడి రాజేశ్వరి(26)కి విశాఖలోని పెద్ద వాల్తేరు జాలారుపేటకు చెందిన శ్యామలరావుతో 2019లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త మద్యం, బెట్టింగ్‌లకు బానిసగా మారాడు. ఆస్తులను తాకట్టు పెడుతుండడాన్ని గమనించిన భార్య నిలువరించే ప్రయత్నం చేసినా వినడం లేదు. దీంతో వారిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. శ్యామలరావు తనమాట వినకపోవడంతో భర్తతో గొడవపడి వారం రోజుల కిందట ఆనందపురంలో తల్లిదండ్రుల వద్దకు పిల్లలను తీసుకొని రాజేశ్వరి వచ్చేసింది. ఆదివారం తెల్లవారు జామున ఆమె గదిలో ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందింది. తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా జేఆర్‌పురం సీఐ అవతారం, లావేరు ఎస్సై అప్పలసూరి, జి.సిగడాం ఏఎస్సై కె.రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు రాజాం సీహెచ్‌సీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

**శ్రీకాకుళం, మే 4 (వార్త):** ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టిబి అధికారి డాక్టర్. టి.శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా కలెక్టర్ మరియు చైర్మన్, జిల్లా క్షయ నివారణ సంస్థ శ్రీకాకుళం వారి ఆదేశాలు మేరకు జిల్లా క్షయ నివారణ సంస్థ నందు ఒక సంవత్సర కాల పరిమితి కలిగిన కాంట్రాక్ట్ పోస్టుకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. ఒక ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు ఒక సంవత్సరం పాటు కాంట్రాక్టు పద్ధతిన పనిచేయుటకు ఆయన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోస్ట్ ఎస్.సి. జనరల్ కేటగిరికి చెందిన 16వ రోస్టర్ పద్ధతిన పోస్టు నియామకం జరుగుతోందన్నారు. పైన తెలిపిన పోస్టుకు అర్హత గల అభ్యర్థుల నుండి ఈ నెల 6 నుండి 15వ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వివరించారు. బయోడేటా, అప్లికేషన్‌తో పాటు విద్యా అర్హత గల అన్ని సర్టిఫికెట్స్ ప్రిపరన్సియల్ అర్హత గల అన్ని సర్టిఫికెట్, మార్క్ లిస్ట్స్, స్టడీ సర్టిఫికెట్స్ 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు తప్పనిసరిగా జిరాక్స్ కాపీలు జతచేయాలన్నారు. ప్రభుత్వ రిమ్స్ హాస్పిటల్ నందు జిల్లా క్షయ నివారణ అధికారి వారి కార్యాలయం, టీ.బి యూనిట్ రూమ్ నెంబర్.24, నందు ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. శ్రీకాకుళం జిల్లా వెబ్సైట్ www.srikakulam.ap.gov.in నందు అప్లికేషన్‌తో పాటు పూర్తి వివరములు తెలియజేస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్ల భర్తీకి..

శ్రీకాకుళం 1, 2వ డిపోలలో ఆన్ కాల్ డ్రైవర్లను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేస్తున్నట్లు డిపో మేనేజర్లు అమరసింహుడు, శర్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్ కాల్ డ్రైవర్లుగా పని చేయుటకు ఆసక్తి, అర్హతలు గల డ్రైవర్లు మంగళవారం ఆర్టీసీ డీఎం కార్యాలయంలో తమ దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 21 ఏళ్లు దాటిన వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 18 నెలల హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పూర్తయిన వారు మాత్రమే అర్హులన్నారు. వివరాలకు 7382924758, 73829 17289 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### 8న జాబ్‌మేళా

**హిరమండలం, మే 4 (వార్త):** మండల కేంద్రంలోని శ్రీరామేశ్వరి కళాశాల ప్రాంగణంలో ఈనెల 8న మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు శివశంకర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బిజినెస్ సపోర్ట్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో 15 కంపెనీలతో జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 18 నుంచి 40 సంవత్సరాల ఆసక్తి గల యువతీ, యువకులు జాబ్‌మేళాను సద్వినియోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 6281318456, 9441178791 నెంబర్లుకు సంప్రదించాలన్నారు.

## 68 కేంద్రాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

* డీఎస్డీఓ ఇన్‌ఛార్జ్ మాధురి లత * కోడిరామ్మూర్తి స్టేడియంలో వేసవి శిబిరాలు ప్రారంభం * ఈనెల 31 వరకూ కొనసాగింపు

**శ్రీకాకుళం, మే 4 (వార్త):** జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మొత్తం 68 కేంద్రాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఇన్‌ఛార్జ్ ఎం.మాధురిలత తెలిపారు. సోమవారం స్థానిక కోడి రామమూర్తి స్టేడియంలో ఈ శిక్షణ శిబిరాలను ఆమె ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు వేసవి సెలవుల్లో సెల్ ఫోన్లకు పరిమితం కాకుండా, క్రీడల్లో శిక్షణ పొంది శారీరక ధారుడ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరాల్లో నిష్ణాతులైన శిక్షకుల ద్వారా మెలకువలు నేర్పించనున్నట్లు ఆమె వివరించారు. ఈ శిబిరాలు మే 31 వరకు కొనసాగుతాయని, క్రీడల పట్ల ఆసక్తి ఉన్న 8 నుండి 16 ఏళ్ల లోపు బాలబాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ బి.వి. రమణ, సెట్ శ్రీ సీఈఓ వి. వెంకట అప్పలనాయుడు పాల్గొని క్రీడాకారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు పి. సుందర్ రావు, శాప్ కోచ్‌లు క్రీడాకారులకు ప్రాథమికాంశాలపై అవగాహన కల్పించారు.



## శభాష్.. విద్యార్థులు




### విద్యార్థుల ఇంటికి వెళ్లి.. అభినందించిన ఎమ్మెల్యే కూన

**ఆమదాలవలస, మే4 (వార్త):** ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి లోని కొత్తకోట వారి వీధికి చెందిన అన్నెపు లాస్య పదో తరగతిలో 600 మార్కులకు గాను 593 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచింది. అలాగే మెట్టెక్కివలసకు చెందిన నౌపడ చిద్వి లాస్ 592 మార్కులు సాధించాడు. ఆమ దాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్. ఆ ఇద్దరు విద్యార్థుల ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి అభినందించారు. కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఎమ్మెల్యే సూచించారు.

### టెన్త్ టాపర్లకు మంత్రి అచ్చెన్న అభినందన

**సంతబొమ్మాళి,కోటబొమ్మాళి, మే4 (వార్త):** ఇటీవల విడుదలయిన పదోతరగతి ఫలితాలలో నరసన్నపేటకు చెందిన ఎ.గాయత్రి ప్రభుత్వ పాఠశాలలో చదివి 581 మార్కులను సాధించింది. అదేవిధంగా పి. తరుణ్ కుమార్ నిమ్మడలో ప్రభుత్వ వసతి గృహములో చదువుకొని 560 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు వారిద్దరినీ అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి మార్కులు సాధించి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. వారిద్దరికీ మంత్రి ఆశీర్వదిస్తూనే భవిష్యత్తులో అండగా ఉంటామన్నారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక విద్యాశాఖామాత్యులు నారా లోకేశ్ తీసుకుంటున్న చర్యల కారణంగా ప్రభుత్వ పాఠశాలలో ఫలితాలు మెరుగుపడ్డాయన్నారు.



### పదిలో మెరిసిన ప్రసన్న.. అభినందించిన కలెక్టర్

**సరుబుజ్జిలి, మే 4 (వార్త):** పదో తరగతి ఫలితాల్లో సరుబుజ్జిలి మండలం పెద్ద సవలాపురం గ్రామానికి చెందిన కోరాడ లక్ష్మి ప్రసన్న అద్భుత ప్రతిభ కనబరిచింది. 600 మార్కులకు గాను 597 మార్కులు సాధించిన లక్ష్మిప్రసన్నకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. లక్ష్మిప్రసన్న తండ్రి కోరాడ గున్నారావు ఇండియన్ ఆర్మీలో అధికారిగా పనిచేస్తున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ అహ్మద్ ఖాన్ విద్యార్థినిని దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



### నేతన్నలకు ఉచిత విద్యుత్తు

* మొదలైన 'సున్నా' బిల్లుల పంపిణీ

**శ్రీకాకుళం, మే 4 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం చేనేత కళాకారులు, పవర్‌లూమ్ యూనిట్లకు ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీని అమలు చేస్తూ శ్రీకాకుళం జిల్లాలో తొలి నెలలోనే లబ్ధిదారులకు 'సున్నా' విద్యుత్ బిల్లులను అందజేసింది. ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి వచ్చిన ఈ పథకం కింద అర్హులైన చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును వర్తింపజేస్తూ ప్రభుత్వం ఇదివరకే ఉత్తర్వులు జారీ చేసిన సంగతి విదితమే. ఈ క్రమంలో జిల్లా చేనేత, జౌళి శాఖ, విద్యుత్ శాఖల సమన్వయంతో శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 1,242 చేనేత కుటుంబాలను, ఒక పవర్‌లూమ్ యూనిట్‌ను అధికారికంగా గుర్తించి, వారికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చినట్లు జిల్లా చేనేత, జౌళి శాఖాధికారి టి. జనార్ధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. సున్నా బిల్లులు రావడంతో చేనేతకార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### అర్జీలు పరిశీలించి.. న్యాయం చేస్తాం

ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



**శ్రీకాకుళం, మే 4 (వార్త):** ప్రజా ఫిర్యాదుల స్వీకరణ మరియు పరిష్కార కార్యక్రమం ద్వారా అందిన ఫిర్యాదులను నిబద్ధతతో పరిశీలించి, చట్టపరంగా వేగవంతంగా పరిష్కరించాలనీ జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి.. జిల్లా పోలీసు అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమం"లో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ ప్రత్యక్షంగా మాట్లాడి, వారి సమస్యలను సమగ్రంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 79 ఫిర్యాదులు స్వీకరించబడినట్లు తెలిపారు. ప్రతి ఫిర్యాదును చట్టపరంగా విచారించి, సత్వర పరిష్కారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఫిర్యాదుదారులకు భరోసా కల్పించారు.

## నృత్య ప్రదర్శనలో మెరిసిన పోలాకి విద్యార్థులు



**పోలాకి, మే 4(వార్త):** పోలాకి గ్రామానికి చెందిన శ్రీ సాయి నటరాజ నృత్యనికేతన్ విద్యార్థులు విజయనగరంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఆదివారం పోలాకిలోని శిక్షణ శాలలో గురువు అవంతిక జక్కువా విద్యార్థులను అభినందించారు. జయశంకర్, మణి కుమార్తె మార్గదర్శకత్వంలో విద్యార్థులు అద్భుత ప్రదర్శనలు ఇచ్చారని ఆమె తెలిపారు. గురువులు కీర్తి ప్రియ, సత్యభాను, హరి రామమూర్తి శిక్షణతో విద్యార్థులు మెరుగైన ప్రతిభను ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విజయంతో పోలాకి ప్రాంతానికి మంచి పేరు తీసుకువచ్చారని, భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని గురువులు ఆకాంక్షించారు.

# ప్రసన్నకు ఎమ్మెల్యే అభినందన

**సరుబుజ్జిలి, మే 4 (వార్త):** పదో తరగతి ఫలితాల్లో పెద్ద సవలాపురం గ్రామానికి చెందిన కోరాడ లక్ష్మీప్రసన్న అద్భుత ప్రతిభ కనబరిచింది. 600 మార్కులకు గాను 597 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలవడమే కాకుండా, రాష్ట్ర స్థాయిలో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ ఘనవిజయం సాధించిన లక్ష్మీప్రసన్నకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. లక్ష్మీప్రసన్న తండ్రి కోరాడ గున్నారావు ఇండియన్ ఆర్మీలో అధికారిగా పనిచేస్తున్నారు. తన విజయంపై లక్ష్మీప్రసన్న స్పందిస్తూ.. భవిష్యత్తులో ఢిల్లీలోని ఎయిమ్స్‌లో వైద్య విద్యను అభ్యసించి, ఉత్తమ డాక్టరుగా ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని వెల్లడించింది. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ అహ్మద్ ఖాన్ విద్యార్థినిని దుశ్శా లువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్సీ పి.విశ్వప్రసాద్, పెద్ద సవలాపురం సర్పంచ్ ప్రతినిధి పల్లి సురేష్ తదితరులు ప్రసన్నను కలిసి అభినందించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని ఇంతటి ఘనవిజయం సాధించడం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి చదివి జిల్లాకు గర్వకారణంగా నిలిచిన లక్ష్మీప్రసన్న మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.



## పాలవలసలో వైద్య సేవలు



**సోంపేట, మే 4 (వార్త):** పాలవలస గ్రామంలో కొర్లాం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చంద్రన్న సంచార చికిత్సలో భాగంగా సోమవారం ఉచిత వైద్య సేవలను అందజేశారు. పాలవలస కుమ్మరిపాడు గ్రామాలకు అందుబాటులో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానికులకు బిపి, షుగర్, హెచ్ బి పరీక్షలు నిర్వహించారు. మలేరియా డెంగ్యూ వ్యాధులకు రక్త పరీక్షలు చేసి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 50 మంది రోగులకు పరీక్షలు జరిపినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ లో చంద్రశేఖర్ ఏఎన్ఎంలు సుజాత ప్రసన్న హెల్త్ అసిస్టెంట్ డి జయ వర్మ, సిహెచ్ఓ మణిమాల వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడు మూడో ప్రత్యామ్నాయం కోరడం హర్షనీయం

**- యువతరం మార్పును స్వాగతించింది**

**- సామాజిక వేత్త శ్రీధర్(బాబా)**

**పలాస, మే 4(వార్త):** తమిళనాడు ఎన్నికల్లో టీవీకె రాజకీయ పార్టీకి మెజార్టీ ఓటర్లు పట్టం కట్టిన తీరి చూస్తుంటే , అక్కడ ప్రజలు అధికారంలో ఉన్న డీఎంకే, ప్రతిపక్షంలో ఉన్న అన్నాడీఎంకేను కాదని కొత్త రాజకీయ పార్టీ టీవీకే వ్యవస్థాపకుడు, సినీ నటుడు విజయ్ కు నీరాజనం పట్టడం హర్షణీయమని ప్రముఖ సామాజిక వేత్త, పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్(బాబా) అన్నారు. సోమవారం ఆయన తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ నేటి రాజకీయాల్లో యువతకు ప్రాధాన్యత దక్కాలన్న లక్ష్యంతో టివికే పార్టీ అధినేత విజయ్ కార్యాచరణ చేసి చూపారని, అంతేగాక ఆ పార్టీ మేనిఫెస్టో కూడా సామాజిక విప్లవం తెచ్చే విధంగా ఉందన్నారు. ప్రధానంగా మహిళ సాధికారిత పేరుతో ఇళ్లలో మహిళా యజమానులకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాల వధువులకు 8 గ్రాముల బంగారం, పట్టుచీర అందజేస్తామని, 29 ఏళ్లు పైబడిన నిరుద్యోగులకు నెలకు రూ. 4000 నిరుద్యోగ భృతి, పేద విద్యార్థుల విద్యా రుణాలు మాఫీ, రైతులకు రుణమాఫీ, చేనేత కార్మికులకు రూ. 10 లక్షల బీమా, ఉన్నత విద్య కోసం 20 లక్షలు వరకు ఎడ్యుకేషన్ రుణం, జాబ్ క్యాలెండర్ వంటి హామీలు విజయ్ ఎన్నికల్లో ఇచ్చారని, వాటిని అమలు చేయవలసిన కొత్తగా అధికారంలోకి రానున్న ప్రభుత్వం బాధ్యత అన్నారు. ఎన్నిక జరిగిన వివిధ రాష్ట్రాల్లో విభిన్న ఫలితాలు వెలువడినప్పటికీ, తమిళనాడు ఎన్నికలు సరికొత్త రాజకీయాలకు తెర లేపినట్లు అయిందని, రాజకీయాల్లోకి వచ్చి కేవలం రెండేళ్లు లోపు పార్టీ స్థాపించి, ప్రజల్లోకి వెళ్లి, వారి అభిమానాన్ని గెలుచుకున్న విజయ్ నాయకత్వంలో తమిళనాడు రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని దువ్వాడ శ్రీధర్(బాబా) ఆకాంక్షించారు.



# హెల్మెట్ తప్పనిసరి

**పోలాకి, మే 4 (వార్త):** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను రక్షించుకోవాలని శక్తి టీం సభ్యులు శ్రీనివాసరావు, ధనలక్ష్మి సూచించారు. సోమవారం పోలాకి మండల సచివాలయ పరిధిలో వాహనదారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాల్లో తీవ్ర గాయాలు, ప్రాణనష్టం ఎక్కువగా జరుగుతున్నాయని వివరించారు. హెల్మెట్ వినియోగం ద్వారా ప్రమాదాల తీవ్రతను గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలను పాటిస్తూ, హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమానికి స్థానికులు స్పందించి, రోడ్డు భద్రతపై చైతన్యం పెంపొందించుకోవాలని నిర్ణయించారు.



## జాతీయ లోక్ అదాలత్ జూలై 11కు వాయిదా

**-జూనియర్ సివిల్ జడ్జి మాధురి**



**పలాస, మే 4(వార్త):** జాతీయ లోక్ అదాలత్ ను జూలై 11వ తేదీకి వాయిదా వేసినట్ల పలాస జూనియర్ డివిజన్ సివిల్ జడ్జి యు మాధురి తెలిపారు. సోమవారం రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ వారి ఆదేశాలపై మే 9 వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ జూలై 11వ తేదీకి వాయిదా వేయడం జరిగిందని తెలిపారు. ఈ విషయాన్ని పలాస న్యాయవాదులు, పోలీస్ అధికారులు ఎక్సైజ్ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, కక్షిదారులు, బ్యాంకు అధికారులు, చిట్ఫండ్ కంపెనీల వారు గమనించగలరని యు మాధురి తెలిపారు.



## పలాసలో ప్రారంభమైన స్కేటింగ్ కోచింగ్ క్యాంప్

**పలాస, మే 4(వార్త):** పలాసలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వారి ఆధ్వరంలో స్కేటింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు స్కేటింగ్ కోచ్ జె.గోపాల కృష్ణ తెలిపారు. ఈ శిబిరం నెల రోజుల పాటు ఉదయం, సాయంత్రం ఉంటుందని, ఆసక్తి ఉన్న క్రీడాకా రులు తమ ఆధార్ కార్డ్, ఫొటోతో హాజరు కావాలని తెలిపారు. కోచింగ్‌లో పాల్గొనే వారికి 8 సంవత్స రాల నుండి 16 సంవత్సరాలు ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 92909053998కి సంప్రదించా లని కోరారు.



## సెలవుల్లోనూ ప్రత్యేక తరగతులు



**నరసన్నపేట, మే 4 (వార్త):** గుండివిల్లిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యాసం నిరంతరం కొనసాగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సోమవారం ఉదయం పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు పూర్తి కృష్ణారావు వేసవి సెలవులు ఉన్నప్పటికీ విద్యార్థులకు ఇచ్చిన హోంవర్క్‌ను పరిశీలించారు. అలాగే మరో వారానికి సరిపడా పాఠ్యాంశాలను వివరించి, ఇంటి వద్ద చదువుకునే విధంగా మార్గనిర్దేశం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు చూపుతున్న ఈ ప్రత్యేక శ్రద్ధపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విద్యలో నిరంతర సాధన అవసరమని, ఈ విధమైన కార్యక్రమాలు విద్యార్థులకు ఉపయోగపడతాయని వారు అభిప్రాయపడుతున్నారు.

## మూడు రాష్ట్రాల్లో విజయం చారిత్రాత్మకం

**సోంపేట, మే 4(వార్త):** పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో సోమవారం వెలువడిన శాసనసభ ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ విజయదుందుభి మ్రోగించడం ఒకసారిరాత్మకమని జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి దున్న శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆయన సోమవారం జాతీయ వార్తతో మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో పరిపాలన ఎంతో ఆకట్టుకుంటుందని అన్నారు. దేశం యావత్తు ఎన్డీఏ పాలనను ప్రజలు గమనిస్తూ అన్ని రాష్ట్రాల్లోనూ బిజెపికి అధికారం ఇవ్వడం దర్శించదగ్గ విషయమని అన్నారు. అభివృద్ధికి లౌకిక విధానానికి కట్టుబడ్డ బిజెపి విధానం ప్రజామోదం పొందుతుందని పేర్కొన్నారు. ఎన్ని క్లిష్ట పరిస్థితులు ఎదురైనా నేనున్నానంటూ ప్రధాని మోడీ ఇస్తున్న భరోసా సాగిస్తున్న ప్రచారం చేయక పాలన ఈ దేశంలో అన్ని రాష్ట్రాలకు అవసరమని అన్నారు. మిగతా రాష్ట్రాల్లో కూడా ప్రజలు బిజెపిని అనుసరిస్తూ అధికారానికి అవకాశం కల్పించాలని కోరారు.



## ఘనంగా అమ్మవారింటికి దేవర

**-జంగిడితో వెళ్లి అమ్మవారికి ఆహ్వానం**

**- వందలాది మంది ఊరేగింపుగా పసుపు, కుంకుమలతో బరిటి వీధికి**

**పలాస, మే 4(వార్త):** టెక్కలిపట్నంలోని నగరంపల్లి పాపారావు జన్ని వారి ఇంటి నుంచి జంగిడితో బయలు దేరి సోమవారం సాయంత్రం ఆరు గంటలకు సింధు కుతారమ్మ గుడికి బాజా, భజంత్రీలతో వెళ్లి పసుపు, కుంకుమతో (బరిటి వీధి) గొల్లవీధిలోని దుబ్బ వంసతమ్మ ఇంట్లో ప్రతిషించారు. తొమ్మిది రోజులు అక్కడ పూజలు జరుగుతాయని ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ ఊరేగింపులో వందలాదిగా మహిళలు కలశాలతో, వేప కొమ్మలతో భక్తి ప్రపత్తులతో పాల్గొన్నారు. జంగిడితో పూనకం పూనిన మహిళ వస్తుండగా పమిటి కొంగులు, చీరలను మహిళలు పరచగా వాటిపైనుంచి అడుగులేసుకుంటూ ఆమ్మతల్లి ఆలయానికి వెళ్లారు. అడుగులేసిన చీరలను భక్తి ప్రపత్తులతో కళ్లకు అద్దుకున్నారు.





## అలరించిన నృత్యాలు

**ఇచ్ఛాపురం, మే 4(వార్త):** సనాతన సంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో కాశి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఫెస్టివల్ 2026 వారణాసి అస్సీ ఘాట్ లో సోమవారం నాట్య ప్రదర్శనలు ఉదయం నుంచి జరిగాయి. నాట్య ప్రదర్శనలు లో స్వేచ్ఛా నృత్య తరంగిణి కూచిపూడి భరతనాట్యం జానపద నాట్య శిక్షణాలయం నాట్య కళాకారులు నాట్య ప్రదర్శనలో నాట్య గురువు మంగి దివ్య శిష్య బృందం కె. కుమార్. సిహెచ్ భూమిక. పి చార్వి. టి. చైత్ర. డి. అక్షిత. పి వర్షిక. బి. జోష్న నాట్య ప్రదర్శనలో పాల్గొన్నారు. కళాకారులకు, అకాడమీ అధ్యక్షులు కె. గోవిందరావు కు తిరుపతి నాట్య చార్యులు డిఆర్ శరత్ చంద్ర ఆర్గనైజర్ నవీన్ చేతులు మీద ప్రశంసా పత్రం నాట్య శివ మెమోటోతో సత్కరించారు. వీరికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కోశాధికారి మంగి దాలమ్మ విద్యార్థుల తల్లిదండ్రులు కళాకారులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# చిన్న కరగాంలో నిరుపయోగంగా సామూహిక మరుగుదొడ్లు

**- నీటి సదుపాయం లేక సమస్య**

**నరసన్నపేట, మే 4(వార్త):** కరగాం పంచాయతీ చిన్న కరగాం గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. గ్రామంలో బహిర్భూమి నిర్మూలన, పరిశుభ్రత మెరుగుదల లక్ష్యంతో వేల రూపాయల వ్యయంతో ఈ మరుగుదొడ్లను నిర్మించారు. అయితే సరైన నీటి సదుపాయం కల్పించకపోవడంతో ఇవి ఉపయోగంలోకి రాకుండా పోయాయి. మరుగుదొడ్ల పరిసరాల్లో తుప్పలు పెరిగి, శుభ్రత లోపించి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన పరిస్థితి కనిపిస్తోంది. ఈ సమస్యపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తూ, వెంటనే నీటి సదుపాయం కల్పించి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు. పరిశుభ్రత కార్యక్రమాల లక్ష్యాలు సాధించాలంటే ఇలాంటి సదుపాయాలను సమర్థంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.



# సాగునీటి రంగం వెనుకబాటుకు తెలుగుదేశమే కారణం



**ఇచ్ఛాపురం, మే 4 (వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గం సాగునీటి రంగంలో అత్యంత వెనుకబడిన ప్రాంతం. రాష్ట్రంలో తలసారి భూమి లభ్యత అతి తక్కువగా వున్న నియోజకవర్గం.ఈ ప్రాంతం గత 40 ఏళ్లలో 35 సంవత్సరాలు ఒకే పార్టీ (తెలుగుదేశం) పార్టీల నాయకత్వం లో ఇచ్ఛాపురం నియోజకవర్గం సాగునీటి రంగం పూర్తిగా కూదేలైపోయింది. ఈ నేపథ్యంలో ఇచ్ఛాపురం నియోజకవర్గం వైస్సార్సీపీ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి ఈదుపురం, కేశపురం బహుదా నది పరివాహక ప్రాంతం లో కాలువలు, పంట పొలాలను స్థానిక రైతులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు.

### ఈదుపురం ఛానల్ :

2018లో వచ్చిన తితిలీ తుఫాన్ వరదలుకి బహుదా నది పై వున్న 11 ఛానెల్స్ శిదిలమైపోయావి. ఈదుపురం ఛానెల్ యొక్క వరదగట్టు సైతం కనీసం పూడ్చలేదు. గత 8 సంవత్సరాలనుండి ఛానెల్ పనిచేయకపోవడం వల్ల ఈదుపురం బహుదా రివర్ ఛానల్ క్రింద సుమారు 550 ఎకరాలు సాగుకు నోచుకోక మొత్తం ప్రాంతం ముళ్లపొదలు పెరిగిపోయి అడవిని తలపిస్తుంది.

### కేసుపురం ఛానల్ :

కేసుపురం బహుదా రివర్ ఛానెల్ క్రింద సుమారు 1000 ఎకరాలు సాగుభూమి ఉండగా గత 10 సంవత్సరాలుగా సాగుకి వీలులేక బీడుగా మారి ముళ్ల తుమ్మ అడవిలా మారినది.

ఇచ్ఛాపురం మండలం అత్యధిక వలసలున్న ప్రాంతం. పాలకులు 80% వ్యవసాయాధారంగా జీవిస్తున్నవారు. ఉపాధి కోల్పోయి ఇతర దేశాలకు కూలికి వలసపోతున్న వైనాన్ని గమనించడమైనది.

ఇచ్ఛాపురం నియోజకవర్గానికి 40 ఏళ్లుగా వున్న తెలుగుదేశం పార్టీ నాయకత్వం అసమర్థత వల్ల, చేతకానితనం వల్ల ఒక్క అదనపు ఎకరాకు సాగుకు తీసురాకపోగా సుమారు 1500 ఎకరాలు బీడుగా మార్చారు. దీనికి ఇచ్ఛాపురం నియోజకవర్గానికి ప్రతినిధ్యం వహించిన ఎంఎల్ఏ లే భాద్యత వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా 2018 తితిలీ తుఫాన్ సమయంలో ఆ తరువాత ఎంఎల్ఏ గా వున్న ప్రస్తుత ఎంఎల్ఏ బెందాళం అశోక్ భాద్యత వహించాలని అన్నారు.

### ఇటుక బట్టీలకు పొలాలు:

వందల సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తూ ఉపాధి పొందుతున్న ఈదుపురం, కేసుపురం రైతులు సాగునీరు లేక తమ పొలాలను ఎంతో కొంత వస్తుందని భూమి సారం కోల్పోతుందని తెలిసినా ఇటుక బట్టీలకు గుత్తకి ఇస్తున్న దయనీయమైన పరిస్థితి కి ఈ తెలుగుదేశం పార్టీ ఎంఎల్ఏ కారణం కాదా?అని ప్రశ్నించారు. వ్యవసాయరంగం మీద ఏ మాత్రం శ్రద్ధ లేని తెలుగుదేశం పార్టీ నాయకత్వం వల్ల ఇచ్ఛాపురం రైతాంగం వలసలు పోయే దౌర్భాగ్యం ఏర్పడింది అని శ్యాంప్రసాద్ రెడ్డి తీవ్ర స్వరం తో విమర్శించారు.

### సాగులేని పొలాల కాలువలకు ఉపాధి పనులు :

2024 జూన్ నెలలో నీరే రాని కాలువలకు 15000 పనులు మంజూరు చేసి పని చేసినట్టు బోర్డు చూసి ఆశ్చర్యానికి గురయ్యారు.ఈదుపురం కాలువ క్రింద పంట కాలువ పనులుజూన్ లో ప్రారంభించినట్టు అది డిసెంబర్ న్ లో పూర్తైనట్టు బోర్డు లో నమోదు చేసారని,సదరు కాలువ ఇటుక బట్టీల వాహనాల రవాణా కోసం కప్పేసి ఉండడం మరో అద్భుతం.అని అన్నారు. ఈదుపురం, కేశపురం లోని సుమారు 1500 ఎకరాలకు సాగునీటి వసతిని కల్పించి భూములకు సాగు పునరుద్దరించాలని శ్యాంప్రసాద్ డిమాండ్ చేసారు.

ఇటీవల కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఇచ్ఛాపురం నియోజకవర్గం లో కలెక్టర్ తో కలసి నిర్వహించిన ప్రజాదర్బార్ లో పంచాయతీ లలో బల్బ్ లు వెయ్యాలని, కరెంట్ పోల్స్ వెయ్యాలని, సిమెంట్ రోడ్ లు కావాలని అడిగారే కానీ సాగు కోల్పోయిన వ్యవసాయ భూములకు నీరందించే ప్రాజెక్టు లు కావలనో, ఉపాధి ప్రాజెక్టు లు కావాలని అడగలేకపోవడం ఎంఎల్ఏ నియోజకవర్గం లోని ప్రజల పట్ల శ్రద్ధ లేని తనానికి, నిలక్ష్యానికి నిదర్శనమని శ్యాంప్రసాద్ తూర్పార పట్టారు. కేంద్ర మంత్రి ప్రజాదర్బార్ లో పంచాయతీ సర్పంచ్ స్థాయి పనులుకు వినతులిస్తారా? ఇదేనా మీ అవగాహన అంటూ ప్రశ్నించారు.

### ఈదుపురం ఎత్తిపోతల పథకం :

ఈదుపురం (జై కిసాన్) ఎత్తిపోతల పథకం 1993 లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసారు. తరువాత వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం లో పనులు నాసిరకంగా చేయడం సక్రమంగా నిర్వహణ లేక 1200 ఎకరాలకు అండవలసిన ఎత్తిపోతల పథకం మూలాన పడేసారు. బహుధానది పై ఎత్తిపోతల పథకం ఒకటి ఉన్నది అన్న స్పృహ అన్నా ఉందా? అని ఎంఎల్ఏ ని ప్రశ్నించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ వ్యవసాయానికి, వ్యవసాయదారులకు చేసిన ద్రోహన్ని బయటపెట్టి రైతులతో కలిసి ఇక్కడి ఎంఎల్ఏ ని, ప్రభుత్వాన్ని ఎండగడతామని హెచ్చరించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం లో వైస్సార్సీపీ ప్రతినిధులు ప్రజల తరపున ఎంఎల్ఏ కి తాను చెయ్యవలసిన భాద్యతలను నిరంతరం గుర్తు చేస్తుంటామని, చేయని పనుల గురించి నిలదీస్తామని హెచ్చరించారు.

ఈ పర్యటన లో వైస్సార్సీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, డీసీఎంస్ మాజీ అధ్యక్షులు సల్ల దేవరాజు, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానంద రెడ్డి, ఎంపీటీసీ ప్రతినిధి ఆశి పురుషోత్తం రెడ్డి,మాజీ సర్పంచ్ లు నర్తు వరప్రసాద్, గుజ్జు ఢిల్లీరావు, కారింగి త్రినాద్, ఇసురు తులసిరాం, మాజీ జడ్పీటీసీ దక్కత నూకయ్య రెడ్డి, ఇసురు పరశురాం రెడ్డి. బదకల భాస్కర్,గస్య బొనమాళి, వడ్డీన తేజ, హంగీర్ బెహరా ఉదయ్ బెహరా,సాడి జయరాం రెడ్డి, రైతులు దుక్క నీలాద్రి రెడ్డి, ఆశి ఈశ్వరరావు రెడ్డి, దట్టి ఉమాపతి, గుజ్జు యర్రయ్య రెడ్డి, బచ్చు చలపతి రెడ్డి, బచ్చు గాపాల్ రెడ్డి, జుత్తు యర్రయ్య, దాసరి జోగారావు, బచ్చు ఏకంబరి రెడ్డి, దువ్వు భాస్కర్, ఉప్పాడ జగదీశ్ మొదలగు వారు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి సహాయనిధితో పేదలకు ఆర్థిక భరోసా

**- ఎమ్మెల్యే రమణమూర్తి**

**- బాధితులకు**

**చెక్కు అందజేత**



**పోలాకి, మే 4(వార్త):** నిరుపేదలకు వైద్య ఖర్చుల విషయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తుందని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి తెలిపారు. పోలాకి మండలం కత్తిరివానిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును అందజేశారు. పోలాకి మండలం రాజారాంపురం గ్రామానికి చెందిన మైలపల్లి త్రినాధరావు అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స కోసం రూ.95,662 విలువైన సహాయాన్ని ప్రభుత్వం మంజూరు చేయగా, ఆ చెక్కును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నదని పేర్కొన్నారు. ఇలాంటి పథకాలు నిరుపేద కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి గొండు చైతన్య, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ నల్లన వెంకునాయుడు, జిల్లా పార్టీ కార్యదర్శి మైలపల్లి త్రినాధరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొర్లె యర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను నిర్మూలించాలి



**నరసన్నపేట, మే 4(వార్త):** బాల్య వివాహాల నిర్మూలనపై సమాజంలో విస్తృత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో బాల్య వివాహాల నిరోధంపై రూపొందించిన ప్రత్యేక పోస్టర్‌ను సోమవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బాల్య వివాహం చిన్నారుల హక్కులను హరించే తీవ్రమైన సామాజిక సమస్యగా పేర్కొన్నారు. చిన్న వయసులోనే వివాహం చేయడం వల్ల బాలికలు విద్యను మధ్యలోనే వదిలేయాల్సి వస్తుందని, వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అవగాహన లోపం, సంప్రదాయాలు, ఆర్థిక పరిస్థితుల కారణంగా బాల్య వివాహాలు కొనసాగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది చట్టపరంగా నేరమే కాకుండా చిన్నారి భవిష్యత్తును ప్రమాదంలో పడేసే చర్య అని స్పష్టం చేశారు. ప్రతి బాలుడు, బాలికకు విద్యను అభ్యసించే హక్కు ఉందని, వారి కలలను సాకారం చేసుకునే అవకాశాన్ని సమాజం కల్పించాలన్నారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువత అందరూ కలిసి బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచిస్తూ, సమాజం ఐక్యంగా పనిచేస్తే ఈ సమస్యను పూర్తిగా నిర్మూలించవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



# ఉపాధి కార్మికులకు మజ్జిగ పంపిణీ

**- సామాజిక సేవకుడి మానవత్వం**

**జలుమూరు, మే 4(వార్త):** దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికులకు ఎండ తీవ్రతలో ఉపశమనం కలిగించేందుకు సామాజిక సేవకుడు, రిటైర్డ్ కమ్యూనికేషన్ సీఐ సూర రామ సూర్యరావు ముందుకొచ్చారు. సోమవారం స్వయంగా పనుల వద్దకు వెళ్లి కార్మికుల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుమారు 400 మంది ఉపాధి హామీ కార్మికులకు ఉచితంగా మజ్జిగ, లస్సీ పంపిణీ చేశారు. మండుతున్న ఎండలో ఈ సేవ వారికి ఎంతో ఉపశమనం కలిగించిందని కార్మికులు తెలిపారు. సూర్యరావు చేసిన ఈ సేవా కార్యక్రమంపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఎండకాలంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు అవసరమని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.



# కోడూరు జెడ్పీ హైస్కూల్ విజయోత్సవం



**పోలాకి, మే 4(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు జి. శాంతి కోరారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా విజయోత్సవ ప్రచార జాతాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాఠశాలకు చెందిన ముద్దపు మౌనిక 577 మార్కులు, ఎరుపల్లి మెగ్న 572 మార్కులు, ఎస్. ఐశ్వర్య 569 మార్కులు సాధించినట్లు తెలిపారు. సాంఘిక శాస్త్రంలో పొట్నూరు వెంకట రామ్ చరణ్ 100కి 100 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. అలాగే 550కు పైగా మార్కులు ఆరుగురు, 500కు పైగా మార్కులు పదిహేడు మంది విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని పాఠశాల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ, ప్రచార రథం ద్వారా ఫలితాలను వివరించారు. ఈ జాతాకు గ్రామ పెద్దలు, తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి. శాంతి, ఉపాధ్యాయులు చింతాడ లక్ష్మణరావు, ఎం. వేణుగోపాలరావు, మోహిని, వెంకటరమణ, నారాయణరావు, శ్రీహరి, హేమలత, జగన్, బాడాన రాజు, రాజేశ్వరరావు, రఫీ, కళావతి, వసంతరావు, రాంబాబు, సూర్యకుమారి, గణేష్, రమణమ్మ, చంద్రయ్య, రాధ, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నేతల సంబరాలు

**ఇచ్ఛాపురం, మే 4(వార్త):** అయిదు రాష్ట్రాల ఎన్నికలు ఫలితాలులో బెంగాల్, అస్సాం, పుదీ చేరి లో ఘన విజయం అలాగే తమిళనాడు లో బీజేపీ కూటమి కీలక స్థానం, కేరళలో ఎన్నడూ లేనివిధంగా కొన్ని అసెంబ్లీ స్థానాలు కైవసం చేసుకున్న సందర్బంగా బీజేపీ పార్టీ ఆదేశాలు మేరకు స్థానిక బస్టాండ్ లో విజయోత్సవాలు జరిగాయి.

ఈ విజయోత్సవన్ని టపాసులు పెల్చుతు మిఠాయిలు పంచుకొన్నారు.ఈ కార్యక్రమం లో బీజేపీ అర్బన్ అధ్యక్షులు సాలిన ఢిల్లీ రావు, బీజేపీ జిల్లా కోశాధికారి వల్లంపాటి క్రిష్ణ ప్రసాద్, ధనుష్ రంగా బిజెపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# ప్రతిభావంతులకు అభినందనలు

**కంచిలి, మే 4(వార్త):** పెద్ద శ్రీరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు పద్మావతి ఉపాధ్యాయ సిబ్బంది సోమవారం అభినందించారు. పి సుశీల 561 ఎల్ సౌజన్య 555, టి నవీన 547 బి మణికంఠ 544 పి దీక్షిత్ 532 టీ మాధురి 513 ఎం హాసిని 509 మార్కులు సాధించడంతో వారిని అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉత్తమమైన ప్రతిభ సాధించాలని ఆకాంక్షించారు.



# శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో అన్నదానం



**జలుమూరు, మే 4(వార్త):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరలో వైశాఖ సోమవారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో అన్నదానం నిర్వహించారు. రాజమండ్రి వాస్తవ్యులు కె.బాను రెడ్డి వారి కుటుంబ సభ్యులు సుమారు రూ.10 వేల వ్యయంతో 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వయంగా వచ్చి అన్నదానం నిర్వహించడం ద్వారా అన్నదాతలుగా మారాలని ఆలయ వర్గాలు సూచించాయి. ప్రస్తుతం దేవస్థానంలో నిత్య అన్నదాన పథకం లేకపోవడంతో, భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి స్వామివారి సమక్షంలో అన్నదానం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవో ఏడుకొండలు, ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. శ్రీముఖలింగేశ్వర దేవస్థానం అర్చక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నాయుడు గారి రాజశేఖర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# అన్నా క్యాంటీన్ సేవల పరిశీలన



**నరసన్నపేట, మే 4(వార్త):** పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో నరసన్నపేట పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన సందర్శించారు. సోమవారం క్యాంటీన్‌లో అందిస్తున్న భోజనాలు, సౌకర్యాలు, పరిశుభ్రతను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేద ప్రజలు, కూలీలు ఆకలితో ఉండకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించి ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు గౌరవభావంతో ఆహారం అందించాలనీ, పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలనీ సిబ్బందికి సూచించారు. క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ప్రజలతో మాట్లాడి భోజనం రుచి, నాణ్యత, సౌకర్యాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలు లేకుండా సేవలు అందించాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ గొద్దు చిట్టిబాబు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, యూనిట్ ఇంచార్జ్ పీస కృష్ణ, జిల్లా తెలుగు నాడు ఫెడరేషన్ అధ్యక్షుడు బలగ ప్రహర్ష, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు రావాడ గణపతిరావు పాల్గొన్నారు.





# ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలి

**- అధికారులతో ఎమ్మెల్యే రమణమూర్తి సమీక్ష**

**నరసన్నపేట, మే 4(వార్త):** ఈ నెల 16న నరసన్నపేట పట్టణంలో జరగనున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గ రమణమూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుధ్యం, మౌలిక వసతులు వంటి అంశాలపై శాఖల వారీగా సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు. పట్టణంలో శుభ్రత, సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, అక్కడి పనితీరును సమీక్షించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పలాసకు మహర్దశ

**ఎమ్మెల్యే గౌతు శిరీష కృషిపై హర్షాతిరేకాలు**

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరుకట్ల విఠల్ రావు**

**పలాస, మే 4 (వార్త):** ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా ఎమ్మెల్యే గౌతు శిరీష అడుగులు వేస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరుకట్ల విఠల్ రావు కొనియాడారు. నియోజకవర్గ రైతాంగం, ప్రజల చిరకాల స్వప్నమైన సాగు, తాగునీటి ప్రాజెక్టుల కోసం ఆమె చేస్తున్న నిరంతర కృషి ఫలితంగానే నేడు నిధుల వరద పారుతోందని ఆయన పేర్కొన్నారు.

**ఆఫ్-షోర్ రిజర్వాయర్‌కు పూర్వవైభవం**

గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అగిపోయిన ఆఫ్-షోర్ రిజర్వాయర్ పనులను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం తాజాగా ప్రాధాన్యత క్రమంలో 383 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని విఠాల్ రావు వెల్లడించారు. ?గత వైఫల్యం: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టు కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, ఆ విషయాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని ఆయన విమర్శించారు. ?ఎమ్మెల్యే చొరవ: ఎమ్మెల్యే గౌతు శిరీష గత 22 నెలలుగా ప్రత్యేక శ్రద్ధ వహించి ఇప్పటికే ఆఫ్షోర్ రిజర్వాయర్‌కు 120 కోట్ల రూపాయలను మంజూరు చేయించారని తెలిపారు. గతంలో మాజీ మంత్రి గౌతు శ్యామ్ సుందర్ శివాజీ హయాంలోనే 465 కోట్ల రూపాయలతో ఈ రిజర్వాయర్ పనులు గణనీయంగా జరిగాయని గుర్తు చేశారు. రైతులకు సకాలంలో సాగునీరు అందించడంతో పాటు పలాస మున్సిపాలిటీ దాహార్తిని తీర్చేందుకు భారీగా నిధులు విడుదలైనట్లు ఆయన వివరించారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నుండి పలాస మున్సిపాలిటీకి తాగునీరు అందించే పథకం కోసం 122 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. వంశధార, మైనర్ ఇరిగేషన్ పనుల కోసం 2 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగింది. పలాస నియోజకవర్గ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీషకు నియోజకవర్గ రైతాంగం, ప్రజల తరపున విఠాల్ రావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆమె కృషి వల్ల పలాస ముఖచిత్రం మారిపోనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



# మాజీ సర్పంచ్ మృతికి సంతాపం




**కంచిలి, మే 4(వార్త):** చిన్నకోజిరియా పంచాయతీ మాజీ సర్పంచ్ గుణప కృష్ణమూర్తి మృతి చెందడంతో ఆయన స్వగ్రాహానికి సోమవారం వెళ్లి ఎంపీపీ పైన దేవదాస్ రెడ్డి స్థానిక వైసీపీ నేతలు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం గల కృష్ణమూర్తి లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. కృష్ణమూర్తి కుమారుడు జిల్లా జడ్జి గోనప షణ్ముఖరావును కలసి తండ్రి మృతి విషయమై మాట్లాడి ఆయన పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో మృత్యుంజయరావు మాజీ సర్పంచ్ సీతారాం ఏల్చూరి అప్పారావు లోళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# సాయిబాబా వెండి పాదాల దొంగకు మూడేళ్ల జైలు

**కొత్తూరు, మే 4 (వార్త):** పారాపురం గ్రామంలో గల సత్యసాయి బాబా మందిరంలో వెండి పాదాల దొంగతనానికి పాల్పడిన నిందితుడికి కోర్టు కఠిన శిక్ష విధించింది. ఈ కేసు వివరాలను కొత్తూరు ఎస్సై వెంకటేశ్ సోమవారం మీడియాకు వివరించారు. పారాపురంలో సుమారు 20 ఏళ్లుగా భక్తుల ఆరాధ్య దైవంగా ఉన్న సత్యసాయి బాబా మందిరంలో 2006, జనవరి 9వ తేదీ సాయంత్రం దొంగతనం జరిగింది. మందిరంలోని సుమారు 28 తులాల బరువున్న, రూ. 56,000 విలువ చేసే బాబా వారి వెండి పాదాలను గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించగా, గ్రామ సర్పంచ్ కుంచాల రత్నాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. ఈ కేసులో కొత్తూరు ఎస్సై కె. వెంకటేశ్ అత్యంత వేగంగా దర్యాప్తు చేపట్టి, కేసు నమోదైన కేవలం 26 గంటల వ్యవధిలోనే నిందితుడైన పోలుమహంతి ప్రసాద్ రావును అరెస్ట్ చేశారు. నిందితుడి నుండి దొంగిలించబడిన వెండి పాదాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసులు పక్కా ఆధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎల్. నాగభూషణం కోర్టులో బలమైన వాదనలు వినిపించి నేరాన్ని నిరూపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కొత్తూరు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కందికట్ల రాణి సోమవారం తుది తీర్పు వెల్లడించారు. నేరం నిరూపితమైన నిందితుడు ప్రసాదరావుకు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.20,000 జరిమానా విధించారు. ఒకవేళ జరిమానా చెల్లించని పక్షంలో నిందితుడు మరో ఆరు నెలల అదనపు జైలు శిక్షను అనుభవించాలని తీర్పులో స్పష్టం చేశారు.

# మోడీ ప్రభంజనంతో.. దీదీ పరార్

**-ఎన్డీఏ కూటమి మూడు రాష్ట్రాల్లో విజయ కేతనం**

**-మున్సిపల్ నాయకుడు నందిగం ధర్మారావు**

**పలాస, మే 4(వార్త):** మోడీ ప్రభంజనంతో పశ్చిమబెంగాల్ దీదీ పరార్‌అని, ఎన్డిఏ కూటమి దెబ్బతో పశ్చిమ బెంగాల్లో తిరుగులేని విజయం సాధించిందని మున్సిపల్ నాయకుడు నందిగం ధర్మారావు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ ప్రచారంతో పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ఘన విజయం సాధించిందని, మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వం కూలిపోయిందని, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అస్సాం, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరీలో విజయం సాధించిందని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ దాదాపు 200 సీట్లతో చారిత్రక విజయం సాధించిందని, టీఎంసీను ఓడించి అధికారంలోకి వచ్చిందని, మోదీ ఎన్నికల ప్రచారంలో ఆరు హామీలు ప్రకటించి ప్రజల్లో ఉత్సాహం రేపారని తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ బీజేపీ అనుకూలంగా ఉన్నప్పటికీ, ఓట్ల లెక్కింపులో కమలం పూసిందని చెప్పారు. పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రజలు టి.ఎం.సి పాలనతో వెనుకబడిపోయిందని, ప్రత్యామ్నాయంగా చూస్తున్న రాష్ట్ర ప్రజలకు ప్రధానమంత్రి మోడీ ఆశలురేపి రాష్ట్రంలో దిమ్మ తిరిగిన ఫలితాలతో ప్రభంజనం సృష్టించారని, ప్రధానమంత్రి మోదీ 2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పూర్బా మేదినీపూర్ బహిరంగ సభలో బెంగాల్ ప్రజలకు ఆరు ముఖ్య హామీలు ప్రకటించారని వెల్లడించారు. ఈ హామీలు రాష్ట్రంలో భయాందోళన తొలగింపు, పరిపాలన మార్పులు, అవినీతి శిక్షలు వంటి అంశాలపై దృష్టి సారించాయని, మోదీ ఆరు హామీలు భయాందోళన వాతావరణాన్ని తొలగించి, న్యాయ పరిపాలనపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించడం జరిగిందన్నారు. పరిపాలనా వ్యవస్థను పూర్తిగా జవాబుదారీగా మార్చడంతో అవినీతి, మహిళలపై దాడులు, అత్యాచార కేసులతో సహా అన్ని అక్రమాలను మళ్లీ సమీక్షించి శిక్షలు విధించడం జరిగిందన్నారు. శరణార్థులకు రాజ్యాంగ హక్కులు కల్పించడం, చొరబాటుదారులను దేశం నుండి తొలగించడం ఒంటి విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, టీఎంసీ పాలనలో అవినీతికి పాల్పడినవారిని చట్టం ముందు తీసుకురావడం జరిగింది అని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 7వ వేతన సంఘం సిఫారసులను అమలు చేయడం, ఈ హామీలు డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో బెంగాల్ అభివృద్ధికి దోహదపడతాయని మోదీ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి మోడీ చరిష్మాతో, జనసేన అధినాయకుడు పవన్ కళ్యాణ్, టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుతో సంయుక్తంగా విజయం సాధించాలని తెలిపారు. పలాస మున్సిపాలిటీలో రానున్న స్థానిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించి మున్సిపాలిటీ అస్తగతం చేసుకుంటుందని చెప్పారు. ఈ ఫలితాలు ఎన్డీఏ కూటమికి ఎంతో ధైర్యం ఇచ్చిందని తెలిపారు.



# ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

**- రైతులకు నవ ధాన్యాల కిట్ల పంపిణీ**

**పోలాకి, మే 4(వార్త):** ప్రకృతి వ్యవసాయంపై రైతులు మరింత దృష్టి సారించాలని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. రైతు సాధికారక సంస్థ ఆధ్వర్యంలో పోలాకి మండలం మబగాం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రైతులకు నవధాన్యాల విత్తన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులు ఈ విత్తనాలను వినియోగించుకుని సేంద్రీయ విధానాల్లో సాగు చేయాలని సూచించారు. తొలకరి వర్షాలకు ముందస్తుగా పీఎండీఎస్ (గ్రావీణా) విత్తనాలుగా పది రకాల జాతులతో కలిపి సుమారు 30 రకాల విత్తనాలను 15 కిలోల కిట్ల రూపంలో అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, నీటి సంఘం అధ్యక్షుడు మొయ్యి శ్రీనివాసరావు, ప్రగడ అప్పలనాయుడు, మొయ్యి దిలీప్ కుమార్, ప్రకృతి వ్యవసాయ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.




# జలవనరుల పునరుద్ధరణకు పకడ్బందీ చర్యలు

*** జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

*** జిల్లాలో 1196 'జలధార' పనులు ప్రారంభం**

**శ్రీకాకుళం, మే 4 (వార్త):** జిల్లాలో భూగర్భ జల మట్టాన్ని పెంచడంతో పాటు, ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టే లక్ష్యంతో 'జలధార - జలహారతి' పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధిలో జల సంరక్షణ కీలకమని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 7,376 పనులను గుర్తించగా, ఇప్పటికే 3,925 పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేశామని, ఇందులో 1,196 పనులు క్షేత్రస్థాయిలో విజయవంతంగా ప్రారంభమయ్యాయని ఆయన వెల్లడించారు. ముఖ్యంగా చెరువుల పూడికతీత, ఫీడర్ ఛానల్స్ పునరుద్ధరణ, చెరువు గట్ల పటిష్టత వంటి పనుల ద్వారా సాగునీటి వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చాలని సూచించారు. మండలాల వారీగా ప్రగతిని పరిశీలిస్తే..మెలియాపుట్టి మండలం 80 శాతం పనులను ప్రారంభించి ఆదర్శంగా నిలిచిందని, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు మండలాలు కూడా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయని ఆయన అభినందించారు. తక్కువ పురోగతి ఉన్న మండలాల్లో పనుల వేగాన్ని పెంచేందుకు ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో జలవనరుల ప్రాముఖ్యతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు 'జలహారతి' కార్యక్రమాలను భాగస్వామ్యం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించి, నిర్దేశించిన గడువులోగా వంద శాతం పనులు గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియా, ఇరిగేషన్ ఎస్ఈ పొన్నాడ సుధాకర్, డ్వామా పీడీ లవరాజు, జెడ్పీ సీఈఓ వెంకటరమణ ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



**వేసవి ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలి**

జిల్లాలో సాగవుతున్న వేసవి పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 4వ తేదీ నాటికి జిల్లాలో మొత్తం 254 హెక్టార్లలో వివిధ పంటలు సాగైనట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో ఉన్న ఏఈఓలు, ఉద్యాన అధికారులు సమన్వయంతో పనిచేసి, సాగు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు.జిల్లా వ్యాప్తంగా సాగవుతున్న 1650 ఎకరాల పామాయిల్, 200 ఎకరాల కూరగాయ పంటల ఈ పంట ప్రక్రియను ఉద్యాన వ్యవసాయ క్షేత్ర సిబ్బంది గడువు తేదీలోగా పూర్తి చెయ్యాలని ఆదేశించారు. అలాగే నువ్వులు 144 హెక్టార్లు, మినుము 76 హెక్టార్లు, పెసర 34 హెక్టార్లలో సాగవుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా పొందురు మండలంలో అత్యధికంగా 110 హెక్టార్లలో సాగు నమోదై అగ్రస్థానంలో నిలిచింది. లావేరులో 88 హెక్టార్లు, రణస్థలంలో 39 హెక్టార్లు, ఆముదాలవలసలో 15 హెక్టార్లలో రైతులు పంటలు వేశారు. సాధారణ విస్తీర్ణం కంటే అదనంగా సాగవుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, రైతులకు అవసరమైన సాంకేతిక సాయం అందించాలని అధికారులను ఆదేశించారు.ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, క్షేత్రస్థాయి పర్యవేక్షణలో అలసత్వం వహించవద్దని ఆయన హెచ్చరించారు. జలధార, జల హారతి పథకం ద్వారా చెరువు కింద సాగవుతున్న పంటల సరళి పై అధ్యయనం చేయాలన్నారు.పంట నమోదు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరిగినా సహించేది లేదని, నిర్దేశించిన గడువులోగా వంద శాతం ఈ-క్రాప్ పూర్తి చేయాలని కలెక్టర్ తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హరిఓం పాండియా, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాద్, ఉద్యాన సహాయ సంచాలకులు చంద్రశేఖర్ సహా 30 మంది మండల వ్యవసాయ అధికారులు, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.


Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts college wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546